# గోరంత దీపం

జయపాల రావు గారిది ఆంధ్రప్రదేశ్‌లో ఓ పల్లెటూరు. ఆయన ఇంజనీర్ అయినా ఇండియాలో సరైన అవకాశాలు లేక ఓ స్నేహితుడి ఆసరాతో అమెరికా వెళ్ళిపోయారు. ఇరవై సంవత్సరాల క్రితం. ఆయనకి ఒక కొడుకూ, ఒక కూతురూ. భార్య రాజేశ్వరమ్మకి అమెరికా అంటే ప్రాణం. ఇండియా అంటే అసహ్యం. ఇందువల్ల ఇండియాలో ఉన్న పొలం,ఇల్లూ అమ్మేసి,డబ్బు తెమ్మని భర్తని ఇబ్బంది పెట్టసాగింది.

అయినా ఆయనకి తన తాతలనాటి ఇల్లూ, పొలం అమ్మబుద్ధి కావటంలేదు. జయపాలరావుగారు పది సంవత్సరాల క్రితం ఒకసారి ఇండియా వచ్చి ఇంటినీ, పొలాన్ని చూసుకున్నారు. మండువా ఇల్లు తాళం పెట్టి ఉండటంతో చాలావరకూ పాడై పోయింది. ఆ ఊళ్ళోనే ఉద్యోగం చేస్తూ అతి మంచివాడు అనిపించుకుంటున్న పోస్టుమేను సుందరాన్ని పిలిచి, తన ఇంటి తాళం చెవి ఇచ్చి- "సుందరం, నువ్వు ఈ ఇంట్లో ఉండు. దీపం పెట్టు. నా పొలం పంట రైతు దగ్గరనుంచి తీసుకుని నాకు పంపించు" అన్నారు.

"అలాగే బాబూ!" అన్న సుందరం ఈ పది సంవత్సరాల నుంచీ పంట బాపతు డబ్బు అణా పైసలతో, సహా లెక్క చూసి జయపాలరావుకి పంపిస్తున్నాడు.

పదేళ్ళ తరువాత జయపాలరావుగారు మళ్ళీ ఇండియా వచ్చారు. ఆయనతో బాటు భార్యా, కూతురు కూడా వచ్చారు. హైదరాబాదులో ఉన్న రాజేశ్వరమ్మ తమ్ముడి ఇంట్లో దిగారు.

"రాజ్యం, మన ఊళ్ళో ఉన్న ఇల్లూ, పొలం ఎలాగూ అమ్మేస్తున్నాం కదా! ఇక ఆ ఊరితో మనకి రుణం తీరిపోతోంది కదా! కనుక నువ్వూ, అమ్మాయీ రండి. అమ్మాయికి పల్లెటూరు చూపిద్దాం" అన్నారు.

"అమ్మో... నేనా, ఆ పల్లెటూరికా, రావటమా? అసంభవం" అంది రాజేశ్వరమ్మ ఇంగ్లీషులో.

"ఏం ఎందుకు రాకూడదూ? ఆ పల్లెటూరిలో ఉన్న నన్నే కదూ, నువ్వానాడు పెళ్ళి చేసుకుంది! ఆ పాత మండువా ఇంట్లోనే కదూ, నాచెయ్యి పట్టుకుని నవవధువుగా గృహ ప్రవేశం చేశావు ! ఆ ఇంట్లోని బావి నీళ్ళు తాగుతూనే ఇద్దరం చాలా రోజులు సంతోషంగా కాలం గడిపాం. మన బాబు పుట్టింది కూడా ఆ గడ్డమీదే కదా!"

"ఆపండి మహాశయా, ఆపండి. ఆ ఊరూ, ఆ ఊర్లోని ఇల్లు మాటవస్తే చాలు మీ చిన్నప్పటి కబుర్లు చెప్పి బోర్ చేసేస్తారు. మీ ఊరికీ, మీ ఇంటికీ ఓ నమస్కారం. కానీ మీరు వెళ్ళి వాటిని అమ్మి ఆ పాత పీడ వదిలించుకుని డబ్బు తెండి"

"రాజీ !" జయపాలరావు గారి ముఖం కందగడ్డలా మారింది.

"పాడు అలవాటు ! రాజీ అనవద్దని ఎన్నిసార్లు చెప్పాను?" విసుక్కుంది రాజేశ్వరి.

జయపాలరావుగారు విసుగ్గా కుర్చీలో వెనక్కి వాలారు. తనకి దగ్గరలోనే కూర్చుని ఇంగ్లీషు నవల చదువుకుంటున్న మోనికని చూస్తూ అడిగారు - "బేబీ, నువ్వన్నా నాతో రామ్మా."

"డాడీ, నాకు పల్లెటూళ్ళంటేనే పరమబోర్. మీరు వెళ్ళి రండి. ఈ లోపల మమ్మీ, నేనూ షాపింగ్ పూర్తి చేసుకుంటాను. నాకు పట్టుచీరలంటే సరదా అని మీకు తెలుసుకదా! కంచి, పోచంపల్లి, ఆరణీ, గద్వాల్, ఇంకా ఏమేం రకాలున్నాయో చూసి, అవి చాలా కొనేసుకుంటాను. సరే కదూ?" గారాంగా అంది బాబ్‌డ్ హెయిర్ సరిచేసుకుంటూ.

"బేబీ, నీ పట్టుచీరల కన్నా కూడా బాగుండేవి అక్కడ చాలా చాలా ఉంటాయమ్మా !"

"ఔనా! ఏమిటవి డాడీ?"

"తియ్యని పనస తొనలు, కమ్మటి పూతరేకులు - ఇలా ఇంకా చాలా ఉంటాయి. అసలు వాటి రుచి నీకు తెలియదే !"

"ఓ అవా? అవేం నా కక్కరలేదు. మీరు వెళ్ళండి డాడీ."

"బేబీ, నేను మాట్లాడుతుంటే మీ మమ్మీ కళ్ళతోనే నువ్వు వెళ్ళొద్దు అన్నటు సైగ చేయటం నేను చూశానమ్మా. కానీ ఒక్క మాట గుర్తుంచుకో బేబీ. ఆంధ్రాని చూడాలంటే హైదరాబాద్‌లో తిరగటం కాదమ్మా. కోనసీమకి వెళ్ళాలి. గోదావరి నదిని చూడాలి. అక్కడ వీచే గాలిని పీలుస్తూంటే 'డాక్టర్' అవసరం ఉండదు. ఆ ప్రకృతిని చూస్తుంటే చెమటోడ్చి పంటలని పండించే రైతన్నలని చూస్తుంటే, మన దేశ సమగ్ర స్వరూపం అర్ధమవుతుంది. మనసు ఆనందంలో పులకరిస్తుంది. ఏనాడో మనపూర్వులు చేసిన 'వేదఘోష' మన చెవులకి వినిపిస్తూన్నట్టే ఉంటుంది. ఆ నీరూ, ఆ గాలీ..... ఓహ్! ఆ గడ్డమీద పుట్టి నందుకు నేను ఇప్పటికీ గర్విస్తూంటాను. బేబీ, నామాటలుయథార్థమో, కాదో ఒక్కసారి వచ్చి చూడమ్మా. మా తల్లివి కదూ.

జయపాలరావుగారు తన్మయత్వంతోచెప్తూ మోనిక వైపు చూశారు. కాని ఆ అమ్మాయి నవల చదవటంలో మునిగిపోయిందనీ, తన మాట ఒక్కటీ వినలేదని అర్ధమై ఆయన మనసు గాయపడింది. ఆ తల్లికి తగ్గకూతురు - అనుకున్నారు మనసులో కోపంగా. "సరే. బేబీ నేను వెళ్ళి వస్తాను" అన్నారు.

జయపాలరావుగారుతనింట్లో అద్దెకి ఉన్న సుందరానికి టెలిగ్రాం ఇవ్వాలని ముందు అనుకున్నారు. కానీ ఆయనకు మనసులో గమ్మత్తైన కోరిక కలిగింది. తను వస్తూన్న విషయం తెలియనప్పుడు సుందరం దంపతులు ఇంటిని ఎలా ఉంచుతున్నారో చూడాలని అంతే, బయలుదేరారు.

అమెరికాలో కోటీశ్వరుడుగా చెలామణి అవుతూ, మూడు కార్లకి రెండు ఫ్యాక్టరీలకీ యజమాని అయినా, ఓ చిన్న సూట్‌కేసు, ఎయిర్ బాగుతో రైలుదిగి, ఆర్టీసి వారి బస్ ఎక్కి చెమట కంపు కొడుతూన్న బట్టలతో ప్రయాణించే అతి సామాన్యుల మధ్య కూర్చుని తన ఊరు చేరారు జయపాలరావుగారు.

## 2

ఇల్లు రెండు ఫర్లాంగుల దూరం ఉందనగా జయపాలరావుగారిని దించేసి ఆర్టీసి బస్ వెళ్ళి పోయింది. బస్‌దిగి పెట్టి, బాగూ పట్టుకుని చుట్టూ చూశారు. పది సంవత్సరాల పూర్వానికి, ఇప్పటికి ఊళ్ళో చిన్న చిన్న మార్పులు వచ్చినట్లుగా కనిపిస్తూ ఉంది. రెండు బట్టల షాపులు, మందుల షాపూ, దాని పక్కన ఓ గాజుల షాపూ, దాని పక్కన కూల్ డ్రింక్‌ల షాపూ, - ఆ ఊరి ప్రగతికి చిహ్నాలుగా ఉన్నాయి.

ఇవన్నీ దాటి నడవసాగారు. జయపాలరావుగారు. ఊరి మధ్య రచ్చబండ. దాని మధ్యలో ఓ రావి చెట్టూ, వేప చెట్టూ. అవి ఏనాటివో తెలియదు కానీ తన బుద్ధి తెలిసిన దగ్గరనుంచీ అవి అలా ఉండటం స్వచ్ఛమైన గాలిని ఇస్తూ, నిశ్శబ్దంగా నిలబడి ఉన్నాయి.

తను చిన్నప్పుడు స్నేహితులతోకలిసి ఈ చెట్టుచాటున దాగుడు మూతల ఆటలు ఆడటం గుర్తు వచ్చింది. తన స్నేహితులు నలుగురు. వాళ్ళతో కలిసి ఎన్నో సంవత్సరాలు ఇక్కడ ఆడీపాడీ పెరిగి పెద్ద వాళ్ళు అయ్యారు. చదువుకోసం బస్తీలు చేరటంతో అందరూ వేరు పడి పోయారు. వాళ్ళు నలుగురూ ఇప్పుడు ఎక్కడున్నారో, ఏం చేస్తున్నారో తెలియదు. ఆ చిన్ననాటి నేస్తాలని గురించి తెలుసుకోవాలని కూడా ఎప్పుడూ అనుకోలేదు. అయితే చాలా సంవత్సరాల తరువాత ఇక్కడికి రావటంతో బాల్యం మనసులో మెదలసాగింది. మనసులో మెదలటం కాదు. అప్పుడే జరుగుతూన్నట్లు కళ్ళ ముందు దృశ్యం కదలసాగింది.

తన తల్లి మహాలక్ష్మమ్మ తెల్లవారుజామున ఎప్పుడు లేచేదో తెలియదు. తను నిద్ర లేచేసరికి వాకిలి ఊడ్చి, పేడనీళ్ళు చల్లి రంగవల్లులు తీర్చిదిద్దేది. ఆ ముగ్గులు వేయటంలో ఏ రోజూ అశ్రద్ధ కనిపించేది కాదు. ముగ్గు వేసి చన్నీళ్ళు తలస్నానం చేసి, తులసి పూజ ముగించుకుని, లోపలికి వస్తున్న తల్లిని నిద్రకళ్ళతో చూసేవాడు తను.

సాదా నేత చీరా, అంచున్న రవికా, కాళ్ళకి పసుపూ, నుదుట కుంకుమా, తడిసిన జుట్టు ముడీ, ఆ ముడిలో తులసి పూజ చేసిన ఓ మందార పువ్వు, చేతిలో పూలసజ్జా, తులసికి నైవేద్యం పెట్టిన ఖర్జూర పండు ఆకూ వీటితో కనిపించే తల్లి ముఖంలోకి తదేకంగా చూసేవాడు. ఆముఖంలో అందంకన్నా ఏదో తెలియని పవిత్రభావం కనిపించేది.

తననే కన్నార్పకుండా చూస్తున్న కొడుకు వైపుచిరునవ్వుతో చూస్తూ – "జయా, ఏడు గంటలు కావస్తోంది. లే బాబూ! లేచి ముఖం కడుక్కుని ఈ ప్రసాదం తీసుకో. స్నానం చెయ్యి. గుమ్మపాలు ఇస్తాను" అంటూ పెరట్లోకి వెళ్ళిపోయేది.

మరో అర్ధ గంటలోనేపిలుపు వినిపించేది.

"కన్నా ! గుమ్మపాలు ఆరకుండా తాగాలి. త్వరగా రా బాబూ!" అమ్మ ప్రేమంతా ఆ మాటలో నిండి ఉండేది. చెవులకి 'కన్నా' అన్న మాట శ్రావ్యంగా వినిపించేది. అంతే తల్లి దగ్గరికి వెళ్ళి గ్లాసు పాలు తాగేసేవాడు.

బాల్యంలో తాగిన గుమ్మపాలు బలమేనేమో తనని ఇంత ఆరోగ్యంగా ఉంచుతోంది! ఈ తరం వాళ్ళకి ఆ బలం ఏదీ ? వీళ్ళ ఆహారపు పద్ధతులే వేరు. అనుకుంటూ జయపాలరావుగారు అడుగులు వేయసాగారు.

ఆ రోడ్డులో నడిచి పోతూన్న ఒకరిద్దరు క్షణం ఆగి జయపాలరావుగారి ముఖంలోకిపరీక్షగా చూస్తూ - "బాబూ, ఎవరింటికి వెళ్ళాలి?" అని అడగసాగారు.

జయపాలరావుగారికి వారి ప్రశ్నకి చికాకు వచ్చింది. "మీదారిన మీరుపోక ప్రశ్నలేమిటి?" లోలోపల గొణుక్కున్నారు.

అయినా వాళ్ళు వదల్లేదు.

"ఈ ఊరికి కొత్తవారిలా ఉన్నారు? ఎవరింటికి వెళ్ళాలి?"

ఈ కొత్త ఆయనకి ఇల్లు తెలియకపోతే తాము చూపించవచ్చు కదూ అన్నది వాళ్ళ ఆలోచన. జయపాలరావుగారి ఆలోచన వేరు. తన పదేళ్ళ క్రితం వచ్చినప్పుడు 'ఎవరింటికి?' అని ఒకతను ప్రశ్నిస్తే గర్వంగా ముఖం పెట్టి మరి చెప్పాడు. "నేను ధర్మయ్యగారి కొడుకుని. అమెరికాలో ఉంటున్నాను. మన ఊరినీ, ఇల్లూ వాకిలిని చూసుకోవాలని వచ్చాను" అని.

"ఆ ...అలాగా... మన ఊరివారే అన్న మాట" అంటూ వెంట వచ్చి చేతిలోని సూట్‌కేసు అందుకని, ఇంటివరకూ వచ్చి దించి వెళ్ళిన అతను సాయంకాలం ఓ పదిమందిని వెంటపెట్టుకుని మరీ వచ్చాడు.

ఒకరు మనవరాలి పెళ్ళికి డబ్బు లేదనీ, కొంత సాయం చేయమనీ అంటే, మరొకరు "గుడిగోపురం మరమ్మతుకి ఓ నాలుగు వేలు మీరు చందా చేయక తప్పదు." ఇలా అందరూ ఒక్కో సమస్య చెప్పి సాయంచేయమని ప్రాధేయపడసాగారు. వారిని సర్ది పంపటానికి తనకి తల ప్రాణం తోకకి వచ్చింది.

అందువల్ల ఈసారి తను ఫలానా అని చెప్పకుండా తప్పించుకుని నడవసాగారు నడిచి నడిచి ధర్మయ్యగారి వీథిలోకి వచ్చేశారు. ఈ వీథిలోనే చివరగా తన ఇల్లుంది.

ధర్మయ్య ఆయన హయాంలో ఈ ఊరికి పెద్ద ఆయనే. అందరినీ బేధభావం లేకుండా చూసేవారుట ఊళ్ళో ఎవరికి కష్టం వచ్చినా, ముందుగా వెళ్ళి ఆదుకునేవారుట. తన ఆస్తిలో సగం పేదలకే పంచేశారు. ఇందువల్ల ధర్మయ్య ధర్మదాతగా ఆ పల్లె ప్రజల మనసుల్లో నిలిచిపోవడమే కాదు. ఆ వీథికి ధర్మయ్య గారి వీథి అని పేరు కూడా పడింది. ఆ పేరు మాసి పోలేదు ఇది గుర్తుకు రాగానే

జయపాలరావుగారి మనసు గమ్మతుగా స్పందించసాగింది. ఏదో తెలియని మధురస్మృతులు ఆయన్ని విచలితుడిని చేస్తుండగానే ఇల్లు రానే వచ్చేసింది. ఆయన క్షణం ఆగారు.

అప్పుడే ఇల్లు వచ్చేసిందా? తను ఈ ఇంటివరకూ నడిచాడా? లేక ఇల్లే తన దగ్గరికి వచ్చిందా? క్షణం అర్థం కాలేదు. అర్థమైన తరువాత పెద్దగా నవ్వు వచ్చింది. అంతే నవ్వేశారు జయపాలరావుగారు.

"ఇంత పెద్దగా నువ్వు నవ్వి ఎన్నాళ్ళు అయింది?" మనసు ప్రశ్నించింది.

దాదాపు ఇరవై సంవత్సరాలు అయి ఉంటుంది." మనసే జవాబు చెప్పింది. మనసు చెప్పిన జవాబుకి ఆయనకి మళ్ళీ నవ్వు వచ్చింది.

నవ్వుతూనే తలెత్తి ఇంటివైపు చూడసాగారు. ప్రవహారీ గోడ సగానికి పైగా కూలిపోయింది. ప్రహారీకి ఉన్న తలుపు రెక్క ఒకటీ ఊడిపోయింది. దర్వాజాకి ఎప్పుడు కట్టినవో మామిడాకులు ఎండి గలగల్లడుతున్నాయి.

ఇవన్నీ చూస్తూనే జయపాలరావుగారు ప్రహారీ దాటి లోపలికి అడుగు పెట్టారు. ఇంటి ముందు భాగం కుడివైపు ఓ పక్కకి వాలిపోయింది. ఇంటి ముందు భాగంలో రెండు గులాబీ చెట్లు, ఓ మందార చెట్టూ, నాలుగు కొబ్బరిచెట్లూ, ఓ నిమ్మ చెట్టూ, ఓ కరివేపాకు చెట్టూ ఉన్నాయి. ఇంటి లోపలున్న ఉయ్యాల ఊగుతూ, ఏదో పుస్తకం చదువుకుంటూ, చెప్పుల చప్పుడుకి తలెత్తి చూసి చప్పున ఉయ్యాల దిగి లేచి వచ్చింది. ఓ అమ్మాయి.

"ఎవరు కావాలి?" జయపాలరావుగార్ని పరిశీలనగా చూస్తూ అడిగింది.

జయపాలరావుగారు ఆ అమ్మాయి అందమైన ముఖాన్ని చూసి జవాబుచెప్పటం మరిచిపోయి అందంగా ఆరోగ్యంగా నిటారుగా నిల్చుని, కొత్త వ్యక్తి అని బెరుకుకూడా లేకుండా సూటిగా చూస్తున్న ఆ అమ్మాయి కళ్ళలో ఏదో కాంతి కనిపించసాగింది. మామూలు సాదా వాయిల్ చీర, మాచింగ్ జాకెట్, బారెడు జడా, మెడలో సన్నటి గొలుసూ, చేతులకి నాలుగేసి మట్టిగాజులు, కళ్ళకి కాటుకా, నుదుట తిలకం ఇంతే ఆ అమ్మాయి అలంకరణ, ఆధునిక స్త్రీలు అందాన్ని పెంచుకునేందుకు గాను వాడే పౌడర్లు, స్నోలు, వగైరా ఆ పిల్ల వాడుతున్న చిహ్నాలు ఏమీలేవు. అయినా క్షణం నిలబెట్టే ప్రత్యేక ఆకర్షణ ఆ అమ్మాయిలో కనిపిస్తోంది. అదేమిటో మాత్రం జయపాలరావుగారికి అంతుబట్టటంలేదు. ఆయన అలా చూస్తూనే ఉన్నారు.

ఆ అమ్మాయి ఆయన్ని గుర్తించినట్లుగా ముఖం పెట్టి ఓ అడుగు ముందుకు వేసింది.

"మీరు...మీరు... అమెరికా మామయ్య కదూ?" అంది.

"ఎలా గుర్తించావ్?" అన్నారు ఆశ్చర్యంగా చూస్తూ.

"మీ చేతికి వున్న ఆ ఖరీదైన వాచీ, ఆ కళ్ళజోడు, మీ దుస్తులను బట్టి".

జయపాలరావుగారు చిన్నగా నవ్వారు 'ఔను' అన్నట్టుగా.

"ఆ పెట్టి ఇలా ఇవ్వండి" అంటూ ఆయన చేతిలోని పెట్టె, బ్యాగూ అందుకుని - "నాన్న మీ ఉత్తరం కోసం ఎదురు చూస్తున్నారు. ఉత్తరానికి బదులుగా మీరు వచ్చేశారు. ఉండండి. కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళు తెస్తాను. అలాగే అమ్మకీ చెప్పి వస్తాను" అంటూ వెనక్కి తిరిగి లోపలికి వెళ్ళబోతున్న ఆ అమ్మాయిని ఆపి "చూడమ్మా, నువ్వు సుందరం కూతురివేనా" అన్నారు సందేహం తీరక.

"ఔను. నా పేరు కనకదుర్గ" అంది నవ్వుతూ "బెజవాడ కనకదుర్గవా?"

దుర్గ పక్కున నవ్వింది. ఆమె నవ్వు మనోహరంగా కనిపిస్తోంది. జయపాలరావుగారికి. ఆ నవ్వులో తెచ్చి పెట్టుకున్న కృత్రిమ నాగరికత లేదు. స్వచ్ఛమైన నవ్వు అది. దుర్గ వంటగదిలోకి వెళ్లింది.

జయపాలరావుగారు గోడకి ఉన్న తన నాయనమ్మ తాతగారు, తండ్రి, తల్లి ఉన్న ఫోటోలని చూడసాగారు. అవి సగానికి సగం పాడైపోయాయి. తను అమెరికా వెళ్ళేప్పుడు ఈ ఇంట్లోని విలువైన వెండీ, బంగారం తీసుకువెళ్ళాడు కానీ, ఈ ఫోటోల మాట గుర్తు లేదు. అందుకు ఆయన మనసు బాధపడసాగింది. అంతలోనే మనసు అంది...

పిచ్చిగా బాధపడకు. అమెరికాలో ఉన్న నీ అధునాతనమైన భవనంలో ఈ పాత ఫోటోలని ఎక్కడ పెట్టుకుంటావ్? పెట్టినా నీ భార్యా, కూతురూ, కొడుకూ వాటిని గోడలకి ఉండనిస్తారా! వీటిని దాచటానికి పాత ట్రంకుపెట్టెలు ఉంటాయా అక్కడ వీటిని ఇక్కడే ఉండనియ్యి"

"ఔను నిజమే. వీటికి విశాలమైన భవనంలో చోటెక్కడిది!" అనుకున్నారు.

"మామయ్యా! నీళ్ళు, ముందు కాళ్ళు కడుక్కోండి. తరువాత మంచి నీళ్ళు తాగండి. మీరు వచ్చినట్లు అమ్మకి చెప్పాను. వస్తోంది" అంటూ మంచినీళ్ళ గ్లాసూ, చిన్న కూజా బిందె అంత చెంబుతో కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళూ ఇచ్చి ఓ శుభ్రమైన టవలు అందించింది.

జయపాలరావుగారు కాళ్ళు కడుక్కుని, మంచినీళ్ళ గ్లాసు అందుకున్నారు.

"దుర్గా! ఈ నీళ్ళు మన పెరటి బావిలోవేనా?" అడిగారు.

"కాదు మామయ్యా... మన బావి పాడైపోయింది. పూడిక తీయించాలి. పక్క ఇంట్లోవి ఇవి."

"అలాగా?" అని అంటుండగానే విమలమ్మ వచ్చింది.

"నమస్కారం అన్నయ్యగారూ. ఉత్తరం రాస్తే బస్సు దగ్గరకి దుర్గా వాళ్ళ నాన్న రావాలని అనుకున్నారు. మీరు పెట్టి కూడా మోసుకుని వచ్చి నట్లున్నారు. ఈ వెధవ పల్లెటూళ్ళలో రిక్షాలన్నా దొరకవు...." నొచ్చుకుంటూ అంది విమలమ్మ.

విమలమ్మ మాటకి ఇందాకటి నుంచి తెలియని చేయి నొప్పి ఇప్పుడు తెలియసాగింది. ఆయన కుడి చేతిని ఎడం చేత్తో నొక్కుకుంటూ అడిగారు. "సుందరం బాగున్నాడామ్మా?" అంటూ కుశల ప్రశ్నలు వేయసాగారు.

"బాగున్నారండీ. ఈ నెలలోనే రిటైర్ అయ్యారు."

"ఔనా?"

దుర్గ కాఫీ ఇచ్చింది.

జయపాలరావుగారు కాఫీ తాగి కప్పు, సాసరూ దుర్గకి అందిస్తూ "కాఫీ బాగుందమ్మా!" అన్నారు.

దుర్గ నవ్వేసింది.

ఇంతలో నలుగురు అమ్మాయిలు పరుగు పరుగున వచ్చారు.

"అక్కా దుర్గక్కా! సోమమ్మ కూతురికి చంటి బిడ్డ గుణం వచ్చిందట. వాళ్ళు ఆ పిల్లని డాక్టర్ దగ్గరకి తీసుకు వెళ్ళకుండా చుట్టముట్టించి వాతలు పెడుతున్నారు. ఆ పిల్ల చచ్చిపోతుంది. అక్కా! నువ్వు త్వరగా రావాలి.

దుర్గ కప్పు, సాసరూ అక్కడే వదిలి, వచ్చిన అమ్మాయిలతో కలిసి వేగంగా వెళ్ళిపోయింది.

ఇదంతా చూస్తూన్న జయపాలరావు గారు....

"ఏమిటమ్మా?"' అన్నట్లుగా చూశారు విమలమ్మ వైపు.

విమలమ్మ దీర్ఘంగా నిట్టూర్చింది. "అన్నయ్య గారూ! దుర్గని మేం చదివించలేక కాకినాడలో ఉన్న మా అన్నయ్య దగ్గర ఉంచి చదివించాం. అక్కడ ఉండి బీ.కాం. పాసైంది. మా అన్నయ్య సంఘ సేవ చేస్తూంటాడు. ఆయనది గాంధీ గారి మతం.

అదంతా దీనికి నూరిపోశాడు. అంతే దుర్గ పూర్తిగా మారిపోయింది. చదువైందిగా, పెళ్ళి చేస్తాం అన్నా వినిపించుకోదు.

"ఆడపిల్లలు నూటికి తొంభై తొమ్మిది మంచి కాలేజీ చదువు కాగానే చేసుకునేది పెళ్ళే కదమ్మా. నే ఒక్కదాన్ని పెళ్ళి చేసుకోకుండా ఉంటే పోయిందేం లేదు. ఉన్న ఊరూ, కన్నతల్లీ ఒకటి కదమ్మా. నేను ఈ ఊరికి చేయవలసింది చాలా ఉంది. ముందా పని చేయనీయమ్మా... అని మమ్మల్ని మరోమాట మాట్లాడనీయదు. అన్నయ్యగారూ, మీరు వస్తున్నారంటే నేను బోలెడంత సంతోషపడిపోయాను. మీరంటే దానికి చాలా గౌరవం. కనుక దానిని పెళ్ళి చేసుకోమని కాస్త నచ్చచెప్పాలి అన్నగారూ!' విమలమ్మ ప్రాధేయ పడుతున్నట్లే అన్నది.

జయపాలరావు గారు ఆవిడ చెప్పేది అంతా శ్రద్ధగా విన్నారు. ఆ తరువాత - " ఈ విషయం నా కిన్నాళ్ళు ఉత్తరంలో రాయలేదు. ఎందుకమ్మా?" అన్నారు.

"రాయమనే చెప్పాను దుర్గా వాళ్ల నాన్నతో. కాని ఆయన నామాట వింటేనా? మనం చెప్పితే విననిది ఎక్కడో దూరంగా ఉన్న ఆయన చెప్తే వింటుందా నీ పిచ్చి కానీ అంటూ నా మాటని తోసిపారేశారు అన్నగారూ?"

"సుందరం నన్ను పరాయివాడిగా చూస్తున్నాడేమో కానీ, నాకు మీరలా అనిపించటం లేదు. మీరు నా ఇల్లు, నా పొలాన్నీ పదేళ్ళుగా కంటికి రెప్పలా కాపాడి, పంట డబ్బు కచ్చితంగా లెక్క కట్టి అణాలు పైసలతో సమా నా పేరున బ్యాంకులో వేస్తున్నారు. మీ ఋణం ఎలా తీర్చుకోను చెప్పు చెల్లెమ్మా!" జయపాలరావు గారు కృతజ్ఞత నిండిన స్వరంతో అన్నారు.

"అదేం మాట అన్నగారూ, మీరు మాకు తల దాచుకోను నీడ ఇచ్చారు ఇన్నేళ్ళుగా. అది చాలు మాకు. మా దుర్గ బుద్ధి తెలిసినప్పటి నుంచీ ఈ ఇంట్లోనే పెరిగింది, దానికి ఈ ఇల్లన్నా, ఈ పెరటిలోని చెట్లన్నా ఆ గోడకి ఉన్న మీ పాత ఫోటోలన్నా చాలా ఇష్టం. ఆ ఫోటోలని అపుడప్పుడూ తీసి శుభ్రంగా తుడిచి, పురుగుల మందు చల్లి మళ్ళీ గోడకి తగిలిస్తూ ఉంటుంది.

"అమ్మా! ఈ ఇంటి అసలైన యజమానులు జయపాలరావు గారు కాదమ్మా. వీరు. వీరు తమ జీవితంలో ఎన్ని ఒడుదుడుకులు ఎదుర్కొన్నా ఈ ఇంటిని అమ్ముకోలేదు. అంటే వారికి ఈ ఇల్లు అంటే ఎంత ప్రాణమో అర్థం అవుతోందామ్మా?

'జననీ జన్మభూమి'' అనే పదానికి అర్థం వీరికి తెలిసినంతగా ఈ అర్థం వారికి తెలియదు కదూ అంటూ ఉంటుంది. అది ఏదేదో చెప్తు ఉంటుంది. కానీ నాకు ఒక్క ముక్క కూడా అర్థం అయిచావదు అన్నగారూ.''

జయపాలరావు గారు విమలమ్మ చెప్పే మాటలు కుతూహలంగా వినసాగారు.

"అన్నగారూ, మరోవిషయం చెప్పనా? పేరట్లో ఉన్న కొబ్బరి చెట్లకి కాసే కాయలు వాళ్ళ నాన్న కోసి అమ్మేయబోతుంటే దుర్గ అంటుంది- "నాన్నా ఆ డబ్బులో సగం అమెరికా మామయ్యగారి బ్యాంకులో వేయాలి. ఎందుకంటే ఈ భూమి స్వంత దారు ఆయన కనుక. మనం ఎంత ఎరువు వేసి పోషణ చేసినా మిగతా సగభాగం మాత్రమే తీసికోవాలి'' అంటుంది. ఆ డబ్బు తీసుకుని తనే మీ బ్యాంకు పుస్తకంలో వేస్తుంది. ఆ పుస్తకం భద్రంగా దాస్తుంది. మీరు వచ్చినప్పుడు ఇవ్వాలనీ.''

"ఔనా?'' ఆశ్చర్యంగా చూడసాగారు. 'ఆ చెట్లు నేను పెట్టినవి కావు అయినా, భూమి స్వంతదారువి కనుక సగభాగం నాకు చెందాలి'' అన్న ధర్మం తెలిసిన అమ్మాయా కనకదుర్గ? అనుకున్నారు మనసులో.

"అయ్యో అన్నగారూ, మాటల్లో మరిచాను. మీరు కుర్చీలోనే కూర్చుండ పోయారు. ఉండండి, మంచం వాలుస్తాను. కాసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత స్నానం చేసి, భోజనం చేద్దురుగాని'' అంటూ గోడవారగా ఉన్న పట్టి మంచం వాల్చి, ఓ దుప్పటి పరిచి, దిండు వేసి " పడుకోండి అన్నగారూ. దుర్గ నాన్న గారు వచ్చేస్తారు. నా వంట కూడా పూర్తి చేస్తాను'' అంటూ విమలమ్మ లోపలికి వెళ్ళింది. మళ్ళీ వెనక్కి వచ్చింది.

"అన్నట్లు అన్నగారూ, మీ అబ్బాయి చదువు పూర్తి అయిఏదో పెద్ద ఉద్యోగంలో చేరాడట. నిజమేనా!'' అంది.

"నిజమేనమ్మా! మా రఘువీర్ ఎం.బి.ఏ. చేశాడు. మంచి ఉద్యోగమే వచ్చింది.

"ఔనా! మీ అమ్మాయి కులాసాగా ఉందా?''

"ఉంది. ఇంకా చదువే పూర్తి కాలేదు.''

"పెళ్ళి చేసేస్తారా మీ రఘువీర్‌కి?''

"చెయ్యాలనే అనుకుంటున్నాం.''

"చెయ్యండి ఎంచక్కా కొడుకూ, కోడలూ ఇంట్లో చిలకా గోరింకల్లా తిరుగుతూంటే చూడముచ్చటా ఉంటుంది. కదూ అన్నగారూ?" అంటూ మళ్ళీ వంట గదిలోకి వెళ్ళింది విమలమ్మ.

జయపాలరావుగారు అలసటగా అనిపిస్తూంటే మంచంమీద వాలారు.

నిశ్శబ్దంగా ఉన్న పరిసరాలు. చల్లటిగాలి వీస్తోంది. పిచికలు కిచకిచమంటూ కిటికీలలో నుంచి రివ్వు రివ్వున వచ్చి - "ఎవరీ కొత్త చుట్టం?" అన్నట్లు జయపాలరావు గారి మంచానికి కాస్త దూరం వరకు వచ్చి తిరిగి వెనక్కి వెళ్ళిపోతున్నాయి. ఆ పిచికల కిచకిచ ఆయనకి జోలపాటలా అనిపించినట్లు అయి చిన్న కునుకు పట్టింది.

## 3

జయపాలరావు గారు ఊరినుంచి వచ్చినట్లు తెల్సి సుందరం ఉరుకులూ పరుగుల మీద ఇల్లు చేరాడు.

"అయ్యా, మీ ఉత్తరం కోసం ఒళ్ళంతా కళ్ళు చేసుకుని నెల రోజులుగా ఎదురుచూస్తున్నాను. అది రాలేదు. మీరు వచ్చారు. ఇందుకు సంతోషం. ఇకపోతే అక్కగారూ, అమ్మాయిగారూ, అబ్బాయిగారూ అంతా కులసాయే కదా?" పాటలా మాటలు వస్తున్నాయి సుందరం నోట్లోంచి.

"అందరూ బాగున్నారు సుందరం. నాభార్యా మోనికా కూడా ఇండియా వచ్చారు. హైదరాబాదులో ఉన్నారు."

"వచ్చారా? మరి అమ్మాయినీ, అక్కగారినీ కూడా మన ఊరు తీసుకు రాకపోయారా?"

"తీసుకురావాలనే అనుకున్నాను. కానీ వీలుకాలేదు. ఇవన్నీ సరే ఇల్లూ, పొలం బేరం ఏం చేశావూ?"

"మొత్తం అంతా నాలుగు లక్షలకి ఒక్క పైసు ఇవ్వం అంటున్నారు."

"ఇంతేనా?"

"ఇప్పుడు ఇంతకంటే ఎక్కువ ఖరీదు రాదండీ. ఎందుకంటే ఈ మధ్యనే గోదావరి తల్లికి వరదలొచ్చి పంటలు దెబ్బతిన్నాయి. రైతన్నల దగ్గర రాగిపైసా లేదు. అయినా మీ పొలం కౌలుకి చేస్తున్న ఈశ్వరయ్య ఆ నేలతల్లిని మరొకరికి వదల్లేక తలతాకట్టుపెట్టి పెళ్ళాం బిడ్డల నగలూ నట్రా తాకట్టు పెట్టి, మీకు ఇచ్చే డబ్బు కూర్చుకున్నాడంటే నమ్మండి, అన్నట్లు కాఫీ తాగారా?"

"తాగాను గానీ మన ఊళ్ళో కబుర్లు ఏమిటి సుందరం?"

"ఈ పల్లెటూళ్ళలో బతికే సామాన్యులదగ్గర ఏం కబుర్లుంటాయి చెప్పండి! ఉన్నవాడిని చూసి లేనివాడు ఏడవటం, నేను గొప్పంటే నేను గొప్పని కొట్టుకు చావటం తప్ప ఏముంటుంది. ఈ దేశంలో మట్టీ, మశానం తప్ప." సుందరం మాటల్లో ఈ దేశం అన్నా, ఆ ఊరన్నా చెప్పలేనంత ఏవగింపు స్పష్టంగా కనిపించ సాగింది.

జయపాలరావు గారు ఎందుకో తృప్తిగా నవ్వు కున్నారు సుందరం మాటలు వింటూ.

విమలమ్మ లోపల నుంచి కేక పెట్టింది - "అన్నగారూ, స్నానానికి నీళ్ళు పెట్టాను."

జయపాలరావు గారు కబుర్లు చాలించి లేచారు.

## 4

సాయంకాలం విమలమ్మ ఇచ్చిన టీ తాగి - "అలా ఊళ్ళోకి వెళ్లి వస్తాను చెల్లెమ్మా" అంటూ బయలు దేరారు జయపాలరావు గారు.

"నేను వస్తాను పదండి" అంటూన్న సుందరాన్ని 'వద్దు' అని వారించి ఒంటరిగానే బయలుదేరుతూ అడిగాడు- "అన్నట్లు కనకదుర్గ పొద్దున్న అనగా వెళ్ళింది. ఇంకా ఇంటికి రాలేదేం?"

"అదా! అది వస్తుంది ఎప్పుడో, ఈ ఊళ్ళో ఎవరికి ఏ చిన్న కష్టం వచ్చినా, ఈ కనకదుర్గమ్మ తల్లి అక్కడ ఉండాలిసిందే. అది మా గోడు వినదు అన్నగారూ. పెళ్ళికి ఎదిగిన ఆడపిల్ల అంటే తల్లిదండ్రులు గుండెల మీద కుంపటి కదండీ. దాన్ని వదలించుకుందామంటే వీలే కావటం లేదు. భగవంతుడు కనికరించి దానికి ఏనాటికి మూడు ముళ్ళూ పడేలాచేస్తాడో! అంత వరకూ మాకు శాంతి లేదంటే నమ్మండి." విమలమ్మ కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ అంది.

"ఇదిగో మన బాధలు ఆయనకి చెప్పి విసిగించకు. బాబూ! మీరు షికారుకి వెళ్లి రండి." సుందరం అన్నాడు.

జయపాలరావు గారు చెప్పులు వేసుకుని బయలుదేరారు. ఒక్కొక్కవీధి పరిశీలనగా చూస్తూ నడవసాగారు. కొన్ని కొన్ని చోట్ల పూరిళ్ళు ఉండవల్సిచోట డాబా ఇళ్ళు వెలిశాయి. ఊరికి కరెంటు వచ్చింది. వీధి దీపాలు వచ్చాయి, అన్నట్లు గతుకుల రోడ్లు ఏమైపోయాయి. ఈ రోడ్లు బానే ఉన్నాయే! పంచాయతీ వారు ఇంత మంచి రోడ్లు వేస్తున్నారా? అయితే గర్వించ దగ్గ విషయమే.

ఆశ్చర్యంగా, ఆనందంగా అనుకుంటూ నడుస్తూ ఎదరుగా వస్తున్న ఓ అరవై ఏళ్ళ ముసలాయన్ని చూసి ఆగిపోయారు. ఆ వృద్ధుడి చేతిలో పలకా, పుస్తకాలూ.

ఆయన్ని "ఏమండి!" అంటూ పిలిచి తన సందేహాన్ని బయట పెట్టారు -"ఈ రోడ్లు పంచాయతీ వారు వేయించినవేనా?"అంటూన్న జయపాలరావు గారి వైపు ఎగాదిగా చూసి కళ్ళజోడు సవరించుకుని అన్నడా వృద్ధుడు.

"మీరి ఊరికి కొత్త వారులా ఉంది. ఎవరింటికి వచ్చారు? ఏ ఊరి నుంచి వచ్చారు?

"అడిగిన మాటకు జవాబు చెప్పకుండా ఎదురు ప్రశ్న పల్లెటూరి బుద్ధి ఇదే. 'మనస్సులో విసుక్కుని -కొత్తవాడిని కనకనే అడిగాను" అన్నారు జయపాలరావుగారు.

"సుందరం కూతురు దుర్గమ్మతల్లి ఉన్నదే, ఆ అమ్మాయి కాకినాడలో చదువు అయి ఈ ఊరికి వచ్చేసిందా, అంతే ఒక్క రోజు కూడా ఇంట్లో కూర్చుని ఎరగదు ఊళ్ళో ఉన్న చిన్న పెద్దా, ముసలీ, ముతకా, ఆడా, మగా అందరినీ కలుపుకుని మన ఊరికి ఉన్న ఇబ్బందులని వివరించి, మన ఊరి అవసారాలు మనం కలిసికట్టుగా పని చేసి తీర్చుకుందాం' అంటూ చెప్పింది, ఇది విన్న వాళ్ళందరూ నవ్వారు. ఆ పిల్లని ఆటలు పట్టించారు. అంతే కాదు గేలిచేసి ఎడిపించారు. అయినా ఆ అమ్మాయి కాస్త కూడా భయపడలేదు. అభిమానపడలేదు. అవమానపడలేదు.

" తన చిన్ననాటి స్నేహితులని కూడగట్టుకుంది. వాళ్ళంతా దుర్గ చెప్పేది అర్థం చేసుకున్నారు. అంతే, వాళ్ళు ఆ అమ్మాయికి ఆసరాగా నిలబడ్డారు. ఓ లైబ్రరీ పెట్టించారు. ఓ టీ.వీ కొన్నారు చందాలు పోగేసి, రోజూ సాయంకాలం మాలాంటి పెద్దవాళ్ళం కూడా అక్కడ చేరతాం. ఈ మారుమూల పల్లెటూరులో కూర్చుని కూడా మేం టీ.విలో ప్రపంచాన్నంతటినీ చూస్తున్నాం. దేశంలో చెందిన అభివృద్ధి చూస్తున్నాం. రాజకీయాలని చూస్తూనాం. వారు మార్చే వేషాలని చూస్తూన్నాం. శ్రీమంతులని చూస్తూన్నాం. పేదరికం చూస్తూన్నాం. నిరుద్యోగం చూస్తూన్నాం. జనాభా సమస్య చూస్తూన్నాం. ఇవన్నీ మన సమస్యలు మనం ఎలాపరిష్కరించు కోవాలా అని ఆలోచిస్తున్నాం. వీలైన ఆలోచనలని ఆచరణలో పెడుతూన్నాం.

"ఇవిగో ఈ పలకా, పుస్తకాలు చూశారా? నేనిపుడు చదువు మొదలు పెట్టాను. నేనే కాదు నా కంటే పెద్ద, చిన్నా, ఆడా, మగా అనే భేదం లేకుండా చిన్నపుడు చదువుకునే అవకాశం లేని మేం ఇపుడు అరవై పడిలో అక్షరాలు దిద్దుతూన్నాం. ఈ

చదువు డిగ్రీల కోసం కాదు. 'మనిషి' అంటే ఏమిటో తెలుసుకునే జ్ఞానం కోసం తాతయ్యా అంటుంది. మా దుర్గమ్మతల్లి. నేను పెద్దబాలశిక్ష చదువుతూన్నాను. సుమతీ శతకం చదువుతూన్నాను. ఓ పద్యం చెప్పమంటావా?'

"వద్దు వద్దు."

"పోనివ్వండి. కానీ మీ ప్రశ్నకి జవాబిచ్చి నా చదువుకి వెడతాను ఈ రోడ్లన్నిమేమందరం కలిసి వేసుకున్నవి. కొందరు వ్యవసాయం. చేసుకుంటున్నారు. మరికొందరు కోళ్ళ ఫారం పెట్టారు. పాడి గేదెలని.కొన్నారు. పెద్ద ఎత్తున పాల వ్యాపారం చేస్తూన్నారు. ఇంకా చాలా చాలా పనుల చేయిస్తోంది. ఈ ఊరి ఆడవాళ్ళచేత. మా దుర్గమ్మని ఈ చుట్టుపట్ల ఊళ్ళలో అందరూ ఏమని పిలుస్తారో తెలుసా! మీకు తెలియదు. నే చెప్తాను వినండి 'ఆంధ్రా కిరణ్ బేడీ' అంటూ ముసలాయన మెల్లగా నడుస్తూ వెళ్ళిపోయాడు.

జయపాలరావుగారికి నవ్వు వచ్చింది ఆ క్షణంలో. కానీ తరువాత ఆ మాట మనసులో కదులుతూ ఉంది. 'ఆంధ్రా కిరణ్ బేడీ'. తిరిగి తిరిగి ఇల్లు చేరుతూంటే వయోజన విద్యా కేంద్రం కనిపించింది. ఆయన ఇల్లు చేరారు. కానీ ఎన్నెన్నో ఆలోచనలు చుట్టుముడుతున్నాయి.

నాలుగు రోజులు గడిచిపోయాయి. ఇక పొలం బేరం ఫైసలా అయ్యేట్టు లేదు. ధర చాలా తక్కువ అని వెళ్ళే ప్రయత్నంలో ఉండి తన ఆలోచన చెప్పారు.

"సుందరం, విమలమ్మా! మీ దుర్గని నా కొడుక్కి చేసుకోవాలను కుంటూన్నాను. దుర్గ అభిప్రాయం తెలుసుకోండి. ఇక మావాడు నామాటకాదనడు. వాడికి ఇండియాలోని పిల్లనే చేసుకోవాలని ఉంది. నా కొడుకు ఫోటో మీరంతాచూశారు కదూ? ఆలోచించి నాకు ఉత్తరం రాయండి.

సుందరం, విమలమ్మా నోరు తెరిచేశారు. నిలువుగుడ్లు వేసుకు చూశారు. ఓ అయిదు నిమిషాల తరువాత భార్యా భర్త లిద్దరూ ఈ ప్రపంచంలోకి వచ్చారు. తాము విన్నది నిజమా-అని మరోసారి ప్రశ్నించి జయపాలరావుగారి జవాబు విన్నారు. అంతే ఆ ఇద్దరి కాళ్ళూ నేలమీద ఆనలేదు. అప్పటికప్పుడే ఆ శుభవార్త అందరికీ చెప్పేందుకు పరుగు తీస్తూంటే జయపాలరావుగారు వారించారు - చూడండీ, ముందు దుర్గ అభిప్రాయం తెలుసుకోవాలి."

"దాని ముఖం! దానికి అభిప్రాయం ఏమిటండీ అన్నగారూ అయినా శిరిరా మోకాలు అడ్డే ఆడపిల్లుంటుందా? కోటీశ్వరుడి ఏకైక పుత్రుడు. అందాల హీరోలాంటి

చదువుకున్నవాడు. పెద్ద ఉద్యోగంలో ఉన్న వాడు. అలాంటి వాడు ఏ ఆడ పిల్లకి దొరుకుతాడు! చెప్పండి! నా దుర్గమ్మ తల్లి ఇంత అదృష్టవంతురాలు అనుకోలేదెపుడూ, అన్నగారూ! నేను ఆనందాన్ని తట్టుకోలేక పోతూన్నాను. ఈ వార్త మా దుర్గమ్మకి చెప్పాలి. ఇప్పుడే చెప్పేయ్యాలి" అంటూ భార్యా భర్తలిద్దరూ బయటికి పరుగుతీశారు. జయపాలరావుగారు వారిస్తూన్నా వినిపించుకోలేదు.

అత్తగారు పెట్టే ఆరళ్ళు భరించలేక నూతిలోకి దూకిన జానకిని బయటికి తీసి ఇరుగు పొరుగు వారితో బాటు, చావుబతుకుల్లో ఉన్న జానకిని డాక్టర్‌కిచూపిస్తూ భగవంతుడిని ప్రార్థింస్తోంది కనకదుర్గ. ఆలస్యమైపోయింది. సారీ" అన్న డాక్టర్ మాటలకి కనకదుర్గ కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి.

ఈ దేశంలో ఆడ పిల్లలకి ఇలాంటి పరిస్థితి ఎప్పటికి తప్పుతుంది. అనుకుంటూ ఇల్లు చేరుకుంటూన్న దుర్గకి తల్లి దండ్రి ఎదురై,శుభవార్త చెప్పారు. దుర్గ ఒక్క క్షణం ఆశ్చర్యపోయి అంతలోనే తేరుకుంది. మౌనంగా ఇల్లు చేరింది.

జయపాలరావుగారు ప్రయాణమై దుర్గకోసం ఎదురు చూస్తూన్నారు. దుర్గని చూస్తునే నవ్వు ముఖంతో అడిగారు - "దుర్గా! నా అభిప్రాయం మీ అమ్మా, నాన్నా ఇప్పటికి నీకు చెప్పే ఉంటారు. నీ ఆమోదం ఇపుడు తెలిపినా, తరువాత తెలిపినా నాకు అభ్యంతరం లేదు. మరి నేను వస్తాను " అన్నారు.

"అమ్మాయీ, సరే అని చెప్పేయమ్మా!" తల్లీ, తండ్రీ కళ్ళలోనే సంజ్ఞ చేయసాగారు.

జయపాలరావుగారు బయలుదేరారు. సుందరం ఆయన పెట్టి, బ్యాగూ తీసుకున్నాడు. వాకిలి వరకూ అందరూ వచ్చారు. విమలమ్మ కూతురుని చేత్తో పొడుస్తోంది.

దుర్గ "మామయ్యా" అంది.

జయపాలరావుగారు సంతోషంగా తల తిప్పారు.

"మామయ్యా జీవితంలో ఎంతో అభివృద్ధి చెందిన మీకు. కోడలుగా రావడానికి ఆడపిల్లలు ఎందరో ఎందరో దొరుకుతారు. కానీ ఈ పల్లెటూరి ప్రజలని, అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతున్న పురుషాహంకారానికి బలి అయిపోతూన్న ఆడవాళ్ళని ఆలోచింపజేయగలిగిన వాళ్ళు ఎవ్వరూ లేరు. వీళ్ళ అజ్ఞానాంధకారాన్ని పారదోలటానికి గోరంతదీపం వెలిగించాను. ఈ దీపం ప్రజ్వరిల్లుతూ అజ్ఞానాంధకారాన్ని పారదోలుతుందో, చమురు

లేక కొడి గట్టి పోతుందో కాలం నిర్ణయించాల్సిందే. అయినా నా ప్రయత్నం లోపం లేకుండా శ్రమించాలని ప్రయత్నిస్తున్నాను. నన్ను ఆశీర్వదించండి మామయ్యా! నా ప్రయత్నం సఫలీకృతం కావాలని ఆశీస్సులు ఇవ్వండి మామయ్యా." దుర్గ గొంతు ఆవేదనగా ఒణకసాగింది.

జయపాలరావుగారి తలగిర్రున తిరిగిపోయింది. అంతలోనే తనని తాను సంబాళించుకున్నారు.

"కనకదుర్గా, నీ ప్రయత్నం సఫలీకృతం అవుతుందమ్మా, అవ్వాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను. నీవు వెలిగించిన గోరంత దీపానికి కొస్త చమురుగా ఉపయోగించే నా ఈ ఇల్లూ, పొలం నీకు చెందేలా కాయితం రాసి పంపిస్తాను. వస్తానమ్మా!" అంటూ వెళ్ళిపోతూన్న జయపాలరావు గారినే చూస్తూ నిలబడిపోయింది కనకదుర్గ.

*(22-11-89 ఆంధ్రప్రభ వార పత్రిక)*